# ఇదీ హనీమూనే!

సుందరి, రాజారావు రెండు కుర్చీల్లో ఇంటి ముందర లాన్‌లో కూర్చున్నారు. తెల్లబొచ్చుకుక్క పిల్ల తోకాడిస్తూ రాజారావు కాళ్ల దగ్గర కూర్చుంది. సుందరి టీ తాగుతూ "దీన్ని ఎవరికైనా ఇచ్చేద్దాం" అంది భర్త రాజారావుతో.

ఈ మధ్య సుందరి ఇచ్చేయడం, వదిలించుకోవడం లాంటి మాటలే ఎక్కువ మాట్లాడుతోంది. అందుకే రాజారావు సుందరి ఏమన్నా 'ఎందుకూ?' అని అడగడు.

"వినిపించిందా?" అంది సుందరి.

"ఆ....కుక్కపిల్లని ఎవరికైనా ఇచ్చేద్దాం" అన్నాడు రాజారావు.

సెల్‌ఫోన్ చెవిలో పెట్టుకుని మాటల్లో మునిగిపోయాడు రాజారావు.

సుందరి ఆలోచలన్నీ ఈమధ్య చాలా చిత్రంగా వుంటున్నాయి. భర్త రిటైరయ్యాడు. తను కూడా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటుంది. ఊళ్ళో ఉండి అప్పుడప్పుడు కనిపించే కూతురు, అల్లుడు అమెరికా వెళ్లిపోయారు. కనుక రిటైరయ్యాక ఏం చేయాలీ అనుకున్నప్పుడల్లా రిటైరైన పిన్ని గుర్తుకొస్తుంది సుందరికి.

రిటైరైనా 'ఎక్కడికెళ్లాలన్నా ఈ కుక్కని ఎలాగే, దాన్ని వదిలిరాలేనే' అనేది పిన్ని. రేపు తమ విషయం అంతేగా!

మళ్లా సుందరికి ఒక విధంగా ఆనందంగా కూడా ఉంది. తను, భర్త హాయిగా ఇంట్లో ఉండొచ్చు... బస్సులు, టైములు, లంచ్‌బాక్సులు, అనవసరమైన స్నేహితులు- ఇలాంటివన్నీ తప్పిపోతాయి. అంతేకాదు, వేడిగా పెసరట్లు వేసుకుతినొచ్చు. అక్కింటికి, పిన్నింటికి వెళ్లి భోజనం చేసి సాయంత్రానికి ఇల్లు చేరవచ్చు. అబ్బో! రిటైరైతే వచ్చే సుఖాలు చాలా లేకపోలేదు. కుక్కపిల్లతో ఆడుకుంటున్న భర్తకేసి చూసింది సుందరి.

తనకి ఉద్యోగ బాధ్యతలు తీరాక ప్రాణం హాయిగా వున్న మాట నిజమే. కాకపోతే భార్య వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవడమే పెద్దగా నచ్చడంలేదు. కానీ ఆ మాటంటే తనని కోపంతో మింగేస్తుంది-ఇలా మనసులో అనుకుంటూ,

"సుందరీ! నువ్వు ఇప్పటినుంచీ రిటైరయి ఏం చేస్తావ్?" అన్నాడు నెమ్మదిగా.

"మీరేం చేస్తున్నారూ-అదే."

"నేనంటే మగాడిని. నాకున్న ప్రివిలేజెస్ నాకున్నాయి. క్లబ్బుకెళ్లి రాత్రి పన్నెండింటికొచ్చినా అడిగేవాడు లేదు. నీ వంట తినలేననిపిస్తే హాయిగా హోటల్ కెళ్లి భోంచేయవచ్చు. ఫ్రెండ్స్‌ని ఇంటికి పిలిచి పేకాట ఆడుకోవచ్చు. మరి ఇలాంటివి నీకు కష్టం కదా. అందుకే మరి ఆలోచించుకో" అన్నాడు కళ్లజోడు నుంచి భార్యను చూస్తూ రాజారావు.

"లోకంలో ఏ భర్తయినా కూడా పాపం పాతికేళ్లనుంచీ కష్టపడి ఉద్యోగం చేసావే, ఇంక చేయకు. హాయిగా ఇద్దరం అమ్మాయి దగ్గరకి అమెరికా వెడదాం అనో, నువ్వు నేను సింగపూర్ వెడదామనో ప్రేమగా అంటారు. మీరేమిటో - ఇవాళే చెప్తున్నా ఆర్నెల్ల తర్వాత తీసుకుందామనుకుంటున్న రిటైర్‌మెంట్ రేపట్నుంచే తీసుకుంటా" గబగబా లోపలకెళ్లిపోయింది సుందరి.

ఇలాగే జరుగుతుందని రాజారావుకి తెలుసు. ఏదో గిల్లికజ్జా పెట్టుకోవడం సుందరి అలవాటు. ఇద్దరూ ఇంట్లో వుంటే హమ్మో అనే భయం ఉంది రాజారావుకి.

ఆ రాత్రి సుందరి పిన్ని వచ్చింది విజయవాడ నుంచి. ఈ మాటలూ, ఆ మాటలూ అయ్యాక,

"ఛీ... ఆడవాళ్ళు ఉద్యోగాల నుంచి రిటైర్ కాకూడదు" అంది.

రాజారావుకి చాలా సంతోషమేసింది ఆ మాట.

"నేనూ అదే చెప్పాను సుందరికి" అన్నాడు వెంటనే. "నేనూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటున్నా" అంది సుందరి భర్తకేసి చూసి పిన్నితో.

"అమ్మో అంత తప్పు చేయకు. ఎందుకంటే మనమూ హాయిగా, ఆరోగ్యంగా వుంటామే. ఇంట్లో ఏ పనులుండవు. పిల్లలు ఎవరి దోవ వాళ్ళది. ఏం చేస్తాం ఇంట్లో ఉండి. పైగా మైక్రోఓవెన్లు, డిష్‌వాషర్లు వచ్చాక ఆడవాళ్ళ పనులు తేలిక కాలేదూ" అంది పిన్ని.

"నే చెప్తే వినడంలేదు" అన్నాడు రాజారావు.

సుందరి ఇద్దరి ముఖాలవంక చూసింది.

వాళ్లిద్దరూ కళ్లతో మాట్లాడుకుంటున్నారనిపించింది.

"నేను మా స్నేహితుడి భార్యను చూసాను. ఇంట్లో ఏం తోచక గోల పెడుతోంది. అందుకే సుందరిని వద్దంటున్నా ఇప్పుడే."

"అవును. అతను చెప్పింది నిజమే. అతని మాట విను" అంది సుందరి పిన్ని.

ఆ తెల్లారే సుందరి పిన్ని ఊరెళ్లిపోయింది. బస్‌స్టాండుకెళ్ళి బస్సెక్కించి వచ్చాడు రాజారావు.

అసలు పిన్ని ఎందుకొచ్చిందీ అనే అనుమానం కలిగింది సుందరికి ఆ తెల్లారి.

సుందరి పిన్ని, జానకి, రాజారావు బిఎలో క్లాస్‌మేట్స్. దూరపు బంధుత్వం కూడా వుంది. సుందరికీ జానకికీ వయసులో రెండేళ్ళ తేడా. చనువు కూడా ఎక్కువ.

అయినా ఇంత అర్జంటుగా వచ్చి వెళ్లిపోయిందెందుకూ అన్నది సుందరి ప్రశ్న. ...నేనాపాటి గ్రహించలేనా? ఈయనే పిలిపించారు.

"నేను రిటైరయి ఇంట్లో కూచూంటాననుకోకండి" అంది సుందరి కోపంగా. "నేనూ క్లబ్బుమెంబర్నవుతాను. నేను మా ఫ్రెండు ఊరు నెలరోజులు వెళ్లివస్తాను. వంట చేయకుండా పదిరోజులు హోటల్లో తినొస్తాను. నేను నా రిటైర్‌మెంట్ ఎంజాయ్ చేస్తాను" అంది సుందరి.

"సరే" అన్నాడు రాజారావు.

వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న సుందరికి భర్త మాట కాదని తను అనుకున్న పని సాధించానని చాలా సంతోషమేసింది.

ఇద్దరూ ఇంట్లోనే పొద్దస్తమానం గడపడం కొంచెం చిరాగ్గా వుంది. ఎక్కడికైనా వెడితే?

"ఏవండీ ఓ వారం రోజులు ఏలూరు వెళ్లివస్తాను మా అన్నయ్య దగ్గరికి" అంది సుందరి.

"నేనూ ఓ పదిహేనురోజులు బెంగుళూరు వెళ్లివస్తాను మా అన్నయ్య దగ్గరికి" అన్నాడు రాజారావు.

"పదిహేనురోజులేమిటి? ఓ వారం వెళ్లి రండి" అంది. మళ్ళీ వెంటనే "పోనీ మీరూ నేనూ కలిసే ఏలూరు వెళ్లొచ్చుగా" అంది సుందరి.

రాజారావు మాట్లాడలేదు. తను వద్దన్నా ఖచ్చితంగా కాదంటుంది సుందరి అని రాజారావు, తనేమన్నా ఖచ్చితంగా కాదంటాడు రాజారావు అని సుందరీ ఎప్పుడూ అనుకునేది ఆ నలభై ఏళ్ళ దాంపత్య జీవితంలో.

అయితే రాజారావు ఈమారు చాలా పట్టుదల పెరిగింది. ఎలాగైనా తన మాట చెల్లించుకోవాలిని-

"సుందరీ! నువ్వు టిక్కెట్టు కొనుక్కున్నావా? అన్నాడు రాజారావు పదిరోజులయ్యాక.

"అప్పటికప్పుడే కొనుక్కోవచ్చు. రాత్రి పదింటికి వెళతాను" అంది ముఖం చిట్లించుకుంటూ.

"నేనూ రేపు రాత్రి పదింటికే. సరే ఇంట్లోంచి కలిసి వెళ్లొచ్చు హాయిగా' అన్నాడు నవ్వి. సుందరి మాట్లాడలేదు.

రాజారావు ఆ రాత్రి చాలా సంతోషంగా వున్నాడు ఎందుకో. "అలా ఒక్కరూ బెంగుళూరు వెళ్లకపోతే ఇద్దరం కలసి ఏలూరు వెళ్లొచ్చుగా. నేను రెండె టిక్కెట్లుకొంటాను" అంది భర్తకేసి చూస్తూ సుందరి.

"నీ ఇష్టం" అన్నాడు రాజారావు. ఛాలా ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి కలిగాయి సుందరికి.

ఇద్దరూ బస్‌స్టాండ్‌కెళ్లారు.

సుందరి క్యూలో నించుంది.

పది నిముషాలకి రాజారావు బస్ వచ్చింది.

"ఒక్కసారి రా" అన్నాడు.

రాజారావు బసెక్కాడు.

"రా" అన్నాడు.

"ఏమిటీ?"

అంది కంగారుగా.

అందరూ తననే చూస్తున్నారనిపించింది. బస్సులో మంచి సీట్లో కూర్చున్న రాజారావు పక్కన కూచింది సుందరి.

సుందరికేమీ అర్థంకాలేదు ముందు. బుగ్గలు, కళ్ళు ఎఱ్రబడ్డాయి.

"అంటే, ముందరే రెండు టిక్కెట్లు రిజర్వు చేయించారన్నమాట. అంటే, తను ఏలూరు వెళ్లకూడదన్న మాట, ఛీ.....ఎంత మోసం!

సుందరి నెమ్మదిగా అంది"

"మోసమేమిటి! నా భార్యతో నేను బెంగుళూరు వెళ్లడం తప్పా. ఈ బస్సులో అందర్నీ అడుగుతా." "ఛీ...ఊరుకోండి. ఎవరైనా నవ్వుతారు" అంది సుందరి.

బస్సు కదిలింది.

సుందరికీ నవ్వొచ్చింది. ఎప్పుడు వెళ్లింది బెంగుళూరు?

"మనం బెంగుళూరు ఎప్పుడెళ్లామో గుర్తుందా?"అంది భర్తని మోచేత్తో తోస్తూ.

"అప్పుడు హనీమూన్‌కి."

సుందరి కిలకిలా నవ్వింది. రాజారావు గలగలా నవ్వాడు. బిరబిరా బస్సు పరిగెత్తింది. రిటైర్‌మెంట్ హాయిగా వుంది ఇద్దరికీ!

"ఏలూరేమిటి, అన్నయ్య దగ్గరకేమిటి! - నా వెఱ్రికానీ హాయిగా బెంగుళూరు, అటునుంచి ఊటి, అటు నుంచి అబ్బో.... ఎన్నయినా చూడవచ్చు. ఇదీ ఓ హానీమూనే!" అనుకుంటూ భర్త భుజం మీద వాలింది సుందరి.

షష్టిపూర్తి కథలు - ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక మే 2001